సాక్షి తిరుపతి

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రతిష్టాత్మకమైన అవార్డు ఈ సారి మహిళా విశ్వ విద్యాలయంలోని ఇంగ్లిష్, ఫార్మసీ విభాగం ప్రొఫెసర్లను వరించింది. - 8లో



నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఆదేశించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	29	25
చిత్తూరు	29	24
తిరుమల	24	21
గూడూరు	30	26
నగరి	30	28

న్యూస్‌రీల్

తిరుమలలో జవాన్!



తిరుమల: శ్రీవారి దర్శనార్థం సోమవారం రాత్రి ప్రముఖ బాలీవుడ్ నటుడు షారుక్‌ఖాన్ తిరుమల చేరుకున్నారు. ఈసందర్భంగా టీటీడీ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

తిరుపతి సిటీ: ఎస్వీయూనివర్సిటీ మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. సుమారు 55మంది నిరుద్యోగులు హాజరుకాగా 19మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఐదు ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారని ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు.

8 నుంచి వరుణయాగం

చంద్రగిరి: సమృద్ధిగా వర్షాలు కురిసి లోకం సుభిక్షంగా ఉండాలని కోరుతూ టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు శ్రీనివాసమంగాపురంలో శ్రీనివాస అష్టోత్తర శతకుండాత్మక మహాశాంతి వరుణయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకుల్లో ఒకరైన శ్రీవేణుగోపాల దీక్షితులు ఈ యాగం ఏర్పాట్లను పర్యవేక్షించనున్నట్టు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,459 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,899 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.05 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. కాగా ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి మంగళం: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 143 వినతులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 103 వినతులు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

హడలెత్తించిన పునుగుపిల్లి



అటకపై నక్కి ఉన్న పునుగు పిల్లి

తిరుమల: తిరుమలలోని బాలాజీనగర్లో పునుగుపిల్లి సోమవారం రాత్రి హడలెత్తించింది. చాలా అరుదుగా చెప్పుకునే పునుగుపిల్లి బాలాజీనగర్లోని 351 నెంబర్ గల ఇంట్లోకి ప్రవేశించింది. వెంటనే స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో ఫారెస్ట్ సిబ్బంది అక్కడికి వెళ్లి పునుగుపిల్లిని బంధించారు.

గురుభ్యోనమః

‘ఒక మొక్క ఏపుగా పెరిగి పెద్దవ్వాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఒక విద్యార్థి ఉన్నతంగా రాణించాలంటే మరెన్నో మెలకువలు పాటించాలి. ఆ విద్యార్థి కోసం అహర్నిశలు శ్రమించాలి. కాలానుగుణంగా బోధనలో వచ్చే మెలకువలను నేర్చుకుంటూ.. వాటిని తరగతి గదిలో సరళంగా.. సులభంగా అర్థమయ్యేలా బోధించాలి. అప్పుడే మన లక్ష్యాన్ని అందుకోగలం. విద్యార్థులను ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దగలం’ అని అంటున్నారు నేటి ఉపాధ్యాయులు.. ముందుగా లక్ష్యాన్ని నిర్దేశిస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. బట్టీ విధానానికి స్వస్తిచెబుతూ.. శాస్త్రసాంకేతిక రంగాల్లోనూ రాణించేలా కృషి చేస్తున్నారు. బడిలోనే కాదు.. బడిబయటా రాణించేలా పిల్లలకు దిశానిర్దేశం చేస్తున్నారు. నేడు గురుపూజోత్సవం సందర్భంగా అత్యుత్తమ బోధనతో అవార్డులందుకుంటున్న ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం.





- బోధనలో వినూత్నంగా అడుగులు
- విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న ఉపాధ్యాయులు
- రాష్ట్ర స్థాయిలో అవార్డుల పంట
- నేడు మహతిలో జిల్లా స్థాయి గురుపూజోత్సవం
- 65 మంది ఉపాధ్యాయులకు సత్కారం
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

తిరుపతి ఎడ్యుకేషన్: నేటి బాలలే రేపటి పౌరులు. అలాంటి పౌరులను ఉన్నతంగా తీర్చిదిద్ది సమాజానికి అందించేవారు గురువులు. విద్యాబుద్ధులు నేర్పి ఆదర్శవంత సమాజాన్ని తీర్చిదిద్దడంలో గురువులు పాత్రే ప్రధానమైనది. ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి ఉన్నత పౌరులను అందించిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి అయిన సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీ. తమ ఉన్నతికి పూలబాటలు వేసిన ఉపాధ్యాయులను స్మరించుకోవడం వారికి ఇచ్చే అసలైన సత్కారం.

నేడు మహతిలో జిల్లా స్థాయి కార్యక్రమం

తిరుపతి జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గురుపూజోత్సవాన్ని మంగళవారం ఉదయం 9గంటలకు తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వ్యవహరించనున్నారు. ఉప ముఖ్యమంత్రి కే.నారాయణస్వామి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మంత్రి ఆర్కే.రోజా, కమ్యూనిటీ డెవెలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్, చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు.

మరో 60మందికి..

తిరుపతి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది ఉపాధ్యాయులను తిరుపతి జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసింది. వీరిలో పది మంది ప్రధానోపాధ్యాయులు, 20 మంది స్కూల్ అసిస్టెంట్లు, 30 మంది సెకండరీ గ్రేడు టీచర్లు ఉన్నారు. వీరికి ముఖ్యఅతిథుల చేతుల మీదుగా అవార్డులు, సత్కారం చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు.

గురువులకు సత్కారం

రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్ష ద్వారా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఐదుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో ఏర్పేడు మండలం, పల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు కొక్కంటి వెంకట్రమణబాబు, కేవీబీపురం ఏపీ మోడల్ స్కూల్ గణిత ఉపాధ్యాయుడు దేవరాజులు నామాల, సైన్స్ ఉపాధ్యాయిని టీ.గాయత్రి, నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సోషియల్ టీచర్ బీ.కృష్ణవేణి, కేవీబీపురం, పీఎం కండ్రిగ ఎస్జీటీ ఉపాధ్యాయుడు షేక్ అబ్దుల్ సమద్ ఉన్నారు. వీరు మంగళవారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించే గురుపూజోత్సవంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోనున్నారు.

బాధ్యత రెట్టింపు



సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు. అందుకే ఉపాధ్యాయునిగా రాణించాలన్న తపనతో 1997లో ఎస్జీటీగా విధుల్లో చేరా. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు మంచి విద్యనందిస్తే పునాది బలంగా ఉంటుందని బలంగా నమ్మా. దీనిద్వారా విద్యార్థులు భవిష్యత్‌లో మంచిగా రాణిస్తారన్నది అక్షర సత్యం. ఆ దిశగా కృషి చేస్తూనే ఉన్నా. కాలానుగుణంగా నన్ను నేను మార్చుకుంటూ నాణ్యమైన విద్య బోధిస్తున్నా. ఈ క్రమంలో 2016లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు వచ్చింది. అదే స్ఫూర్తితో విధులు నిర్వహించడంతో రాష్ట్ర స్థాయి అవార్డు వరించింది.

– కాశిరెడ్డి నాగమణి, ఎస్జీటీ, సీఆర్ కండ్రిగ ఎంపీపీ పాఠశాల, తిరుపతి రూరల్

మరింత బాధ్యతతో బోధిస్తా



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు వరించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తా. నాకు చిన్నతనం నుంచే సైన్స్‌పై మక్కువ ఎక్కువ. విద్యార్థులు పరిశోధనా రంగం వైపు అడుగులు వేసేలా ప్రేరేపించాలన్నదే నా ఆశ. అందుకే ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నా. 1986లో స్పెషల్ టీచర్‌గా అడుగు పెట్టా. 1987లో ఎస్జీటీగా.. 2002లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందా. నేను పనిచేసిన పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లను ఆదర్శవంతంగా తర్చీదిద్దా. ఈ నేపథ్యంలోనే 2019 జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నా. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోబోతున్నా. ప్రతి విద్యార్థినీ శాస్త్ర సాంకేతిక రంగంలో రాణించేలా తీర్చిదిద్దాలన్నదే నా ధ్యేయం.

–జీ.సురేంద్రారెడ్డి, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్), అరిమేనిపాడు జెడ్పీ హైస్కూల్, ఓజిలి మండలం

నిబద్ధతతో పనిచేస్తా



నేను తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీయూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగపు అధ్యాపకుడిగా పనిచేస్తున్నా. పదేళ్లుగా పాలిటెక్నిక్ లెక్చరర్‌గా నిబద్ధతతో పనిచేస్తున్నా. ఎంతో మంది విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దా. పాలిటెక్నిక్ విద్యార్థులకు సరళంగా.. సులభంగా అర్థమయ్యేలా మూడు పుస్తకాలు రచించా. వివిధ జర్నల్స్‌లో వ్యాసాలు రచించా. పాలిటెక్నిక్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్స్‌ను నిర్వహించా. ఎంతోమంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించా. ఇప్పుడు రాష్ట్ర ఉత్తమ పాలిటెక్నిక్ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది.

– డాక్టర్ ఎం.హరిప్రసాద్, పాలిటెక్నిక్ లెక్చరర్, ఎస్వీయూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి

వేల ఏళ్ల క్రితమే శిల్ప కళ

- కలంకారీని రాష్ట్ర కళగా ప్రకటించేందుకు కృషి
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వెల్లడి



శిల్పకళా ప్రదర్శనను సందర్శిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, జేఈఓ సదాభార్గవి

తిరుపతి కల్చరల్: కలంకారీని రాష్ట్రకళగా ప్రకటించేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పిస్తానని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. ఎస్వీ సంప్రదాయ శిల్ప శిక్షణ సంస్థలో సంప్రదాయ ఆలయ శిల్పకళలు–అనుబంధ అంశాలపై మూడు రోజుల సదస్సు సోమవారం ప్రారంభమైంది. టీటీడీ చైర్మన్ భూమన ముఖ్య అతిథిగా విచ్చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలంకారీ రెండేళ్ల సర్టిఫికెట్ కోర్సును నాలుగేళ్ల డిప్లొమా కోర్సుగా మార్చేందుకు బోర్డులో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 30 వేల సంవత్సరాల క్రితమే శిల్పకళ ప్రారంభమైందని, కళల్లో శిల్పకళకు గొప్ప స్థానం ఉందన్నారు. వేల సంవత్సరాల క్రితమే ఆలయాలు, ప్రార్థనా మందిరాల నుంచి ఈ కళ ప్రారంభమైందన్నారు. 17 ఏళ్ల క్రితం ఈ కళాశాల పరిస్థితి చూసి మార్పులు చేశామని తెలిపారు. ఈ కళాశాల విద్యార్థులతో అర అడుగు, ఒక అడుగు మేర శ్రీవేంకటేశ్వరస్వామి వారి ప్రతిమలు తయారు చేయించాలని గతంలో భావించానని చెప్పారు. స్వామివారు తనకు మళ్లీ అవకాశం ఇచ్చారన్నారు. ఇలాంటి విగ్రహాలు ప్రతి ఇంట్లో ఉంచుకోవడం ద్వారా స్వామివారు తమతోనే ఉన్నారన్న భావన భక్తులకు కలుగుతుందని తెలిపారు. జేఈవో సదాభార్గవి మాట్లాడుతూ వర్క్‌షాపులో పనిచేస్తున్న శిల్పులకు ధరలు పెంచారన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రోత్సాహాన్ని కరుణాకరరెడ్డి చైర్మన్‌గా ఉన్నప్పుడే ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పటివరకు 815 మంది విద్యార్థులను శిల్పులుగా తయారు చేసినట్లు తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రముఖ స్థపతి సంతానకృష్ణన్, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

శిల్ప కళా ప్రదర్శన ప్రారంభం

కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిల్పకళా ప్రదర్శనను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. ఇందులో ఆలయ నిర్మాణకళ, శిలా విగ్రహాలు, సుధా విగ్రహాలు, సంప్రదాయ చిత్రకళ, సంప్రదాయ కలంకారీ కళ, హస్తకళ ప్రదర్శనలు ఉన్నాయి. కుమారి పీ.సాయిదేవిక నిరుపయోగమైన వస్తువులతో తయారు చేసిన వివిధ కళాకృతుల స్టాల్‌ను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. గాజు సీసాలు, మట్టి కుండలు, జ్యూట్‌తో తయారు చేసిన గృహాలంకరణకు ఉపయోగపడే అనేక కళాకృతులు ఈ స్టాళ్లలో ఉన్నాయి. ఇవి ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కొలువుదీరిన పాలకమండలి



నూతన పాలకమండలి సమావేశానికి హాజరైన వీసీ, రిజిస్ట్రార్, సభ్యులు

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలకమండలి సభ్యుల తొలి సమావేశం సోమవారం వర్సిటీలో నిర్వహించారు. వీసీ డీ.భారతి మాట్లాడుతూ పాలకమండలిలో పలు అంశాలపై చర్చించామన్నారు. ఇందులో ఎక్స్ అఫిషియో సభ్యులతో ఆమోదం పొందిన రేషనలైజేషన్ ప్లాన్, అధ్యాపకుల నియామకానికి సంబంధించిన ప్రభుత్వ జీవోపై చర్చించినట్టు తెలిపారు. వర్సిటీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులకు వెయిటేజ్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సంమావేశానికి రిజిస్ట్రార్ ఎన్.రజనీ, నూతన పాలకమండలి సభ్యులైన ఆచార్య అనురాధ, ఆచార్య శారద, ఆచార్య ఉమాదేవి, ఆచార్య లీలారత్నం, ఆచార్య సువర్ణలతా దేవి, సువర్ణ, వర్చువల్ ద్వారా ఉన్నత విద్యాశాఖ చైర్మన్ ప్రొఫెసర్ కే.హేమచంద్ర, డీసీ వెంకటేశ్వరావురెడ్డి పాల్గొన్నారు.

స్పందనకు 75 ఫిర్యాదులు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 75 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇందులో ఆస్తివివాదాలు, భూతగాదాలు, దొంగతనాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

ఆడుదాం ఆంధ్రపై సమీక్ష

తిరుపతి మంగళం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో విజయవంతం చేయాలని జేసీ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, టెక్నికల్ కమిటీ, పీఈటీలు సమన్వయంతో కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. సీఈఓ మురళీకృష్ణ, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో దేవదాయశాఖ కమిషనర్



కమిషనర్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అధికారులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మను సోమవారం దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన ఆయనకు ఆలయ మర్యాదతో అర్చక వేద పండితులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతర తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కమిషనర్ ఆలయంలో చేపడుతున్న ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ అభివృద్ధి పనులను వీలైంతన త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డితో ఆలయ రాజగోపురం విషయంపై చర్చించి త్వరలో పనులను మొదలు పెడతామన్నారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, తిరుపతి జిల్లా దేవదాయ శాఖ అధికారి పీ.రామకృష్ణారెడ్డి, తనిఖీదారుడు ఫణిరాజ్, ఆలయ ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

9న వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీ క్యాంపస్ పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 2గంటల నుంచి అండర్–19 వాలీబాల్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. ఈ పోటీలకు 01-01-2005 తర్వాత జన్మించి, ప్రస్తుతం ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, పదో తరగతి మార్క్‌లిస్ట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ సంతకంతో హాజరవ్వాలని సూచించారు.

ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



తిరుపతి బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీపీటీఓ

తిరుపతి మంగళం: శ్రీవారి బ్రహ్మోతవాల్లో తిరుమలకు విచ్చేసి భక్తులు, ప్రయాణికులకు ఆర్టీసీ బస్టాండ్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తిరుపతి జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి చెంగల్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతి ఆర్టీసీబస్ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్ స్టేషన్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు.

అవినీతిని కట్టడిచేద్దాం!

వెంకటగిరి రూరల్: పేద పిల్లలకు అందజేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో అవినీతిని కట్టడి చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటగిరిలోని గురుకుల బాలికల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, రాణీపేట అంగన్‌వాడీ కేంద్రం, సివిల్‌సప్లయ్ గోడౌన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని రుచిచూశారు. ఆయన మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే 9490551117 నంబర్‌కు వీడియో రూపంలో, 155235 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఏపీ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో 575 మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ.2 వేల విలువ కలిగిన ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ముందస్తుగా ఆ పాఠశాల ప్రిన్సిపల్ రజనికి రూ. 2వేలు ప్రోత్సహక నగదు అందజేశారు. అనంతరం పట్టణంలోని రాణీపేట అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డుల తనిఖీ చేశారు.



వెంకటగిరి ఏపీ మోడల్ స్కూల్‌లో భోజనాన్ని రుచిచూస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

ఆకస్మిక తనిఖీ

డక్కిలి: డక్కిలిలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల, డక్కిలి జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ఎస్టీ కాలనీలోని అంగనవాడీ–2 కేంద్రం, వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని లింగసముద్రం దళితవాడలో ఉన్న అంగనవాడీ కేంద్రాన్ని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషనర్ తనిఖీ చేశారు. సోమవారం మెనూలో భాగంగా వెజిటేబుల్ బిర్యానీ రుచి చూశారు. డక్కిలి, లింగసముద్రం అంగనవాడీ కేంద్రాల్లో చిన్నారులతో మాట్లాడారు. మోపూరు రోడ్డు సెంటరులో ఎన్‌డీఎం ఆపరేటర్ ఇస్తున్న రేషన్ సరుకులను పరిశీలించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

శ్రీకాళహస్తి: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ఫుడ్ కమిషనర్ ఆదేశించారు. ఆయన పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల, ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

క్లుప్తంగా

ఉపాధిపై ఉచిత శిక్షణ

తిరుపతి మంగళం : నిరుద్యోగ యువతకు టూరిజం అండ్ హాస్పిటలిటీ సెక్టార్‌లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు డీఆర్డీఏ పీడీ ఏడీ.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గ్రామీణ యువతీ, యువకులకు తిరుపతి ఎస్వీ జూపార్క్ రోడ్డులోని భారత పర్యాటకశాఖ, ఏపీ పర్యాటకశాఖలు సంయుక్తంగా స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటగిరి టెక్నాలజీ అండ్ అప్‌లైడ్ న్యూట్రిషన్ వద్ద ఉచిత ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఇక్కడి కోర్సులు డెమీ చెఫ్ ద పార్టీ(కిచెన్ సూపరివైజర్) నాలుగు నెలలు, రెస్టారెంట్ కెప్టెన్ మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్, ఐటీఐ పాస్ అయ్యి ఉండాలని, 18 నుంచి 28 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. యువత ఈనెల 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. శిక్షణలో అర్హత సాధించిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ హోటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9160912690, 9100558006, 9032697478 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాటుబాంబులు, కత్తులు స్వాధీనం

- నలుగురు తమిళ రౌడీ షీటర్లకు రిమాండ్



తమిళనాడు రౌడీ షీటర్లతో సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ పరమేష్ నాయక్, పోలీసు సిబ్బంది

నారాయణవనం: జాతీయ రహదారిపై పోలీసుల నిర్వహించిన తనిఖీల్లో రెండు నాటు బాంబులు, కత్తులు, సెల్‌ఫోన్, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన నలుగురు రౌడీ షీటర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం మీడియా సమావేశంలో సీఐ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు అప్రమత్తం చేయడంతో నారాయణవనం ఎస్ఐ పరమేష్ నాయక్ తన సిబ్బందితో ఆదివారం సాయంత్రం కైలాసనాథకోన క్రాస్‌వద్ద జాతీయ రహదారిలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. పుత్తూరు నుంచి ఊత్తుకోట వైపు రెండు మోటార్ సైకిళ్లపై నలుగురు పోలీసులను చూసి ఆపకుండా వెళ్లిపోయారు. పోలీసులు వెంబడించి పారిపోవడానికి ప్రయత్నించిన గణేష్(30), బోస్ ప్రభు(29), పుగయెంథి(23), అజిత్(21)లను అదుపులో తీసుకుని విచారించారు. పొంతన లేని సమాధానాలు రావడంతో వారిని తనిఖీ చేశారు. రెండు నాటు బాంబులు, రెండు కత్తులు, 6 మొబైల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లతో పాటు రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని పోలీసులు విచారించగా చెన్నైలో కదిరవన్, సురేష్ గ్యాంగ్‌ల మధ్య వార్ జరుగుతోందని తెలిసిందన్నారు. పథకం ప్రకారం సురేష్‌ను హతమార్చడానికి కదిరవన్ గ్యాంగ్‌కు చెందిన గణేష్, బోస్‌ప్రభ పుగయెంథి, అజిత్ రెండు మోటార్ సైకిళ్లపై నాటుబాంబులు, కత్తులతో నారాయణవనం మీదుగా చెన్నైకి వెళుతున్నట్టు నిందితులు అంగీకరించారని సీఐ తెలిపారు. చెన్నై నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో గణేష్‌పై 25 కేసులు, బోస్ ప్రభుపై 5 కేసులు, పుగయెంథిపై 13 కేసులు ఉన్నాయని, వారిపై తమిళనాడు పోలీసులు రౌడీ షీట్లను తెరిచినటు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసును నమోదు చేసి సోమవారం మధ్యాహ్నం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. తమిళ రౌడీ షీటర్లను అరెస్ట్ చేసి, నాటు బాంబులు, కత్తులను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ పరమేష్ నాయక్, సిబ్బందిని ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రమాణ స్వీకారం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా రామిరెడ్డి, అశ్వర్థ నాయక్ సోమవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో వీరి చేత జేఈఓ వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం వీరికి ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఓ కస్తూరిబాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,250
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,518

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,500
రిటైల్ వెండి గ్రాము	రూ.77.50

ప్రకృతి వ్యవసాయంపై పుస్తకావిష్కరణ



ప్రకృతి వ్యవసాయ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి మంగళం : ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రాస్–కృషి విజ్ఞాన కేంద్రం రూపొందించిన పుస్తకాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి ఆవిష్కరించి పుస్తకాన్ని రూపొందించిన శాస్త్రవేత్తలను అభినందించారు. వ్యవసాయంలో అధిక దిగుబడుల కోసం రైతులు రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను అధిక మోతాదులో వాడడం వలన నేల, నీరు, వాతావరణ కలుషితమై పంటల్లో ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. కాబట్టి రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆదరించాలని, ఆ దిశగా రాస్–కృషి విజ్ఞాన కేంద్రం రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాస్–కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు వి.దివ్య, పద్మజ, సుధాకర్, అనూష పాల్గొన్నారు.

ఎంబీయూలో ఘనంగా ఇండక్షన్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న ఎంబీయూ వీసీ ఆచార్య నాగరాజు రామారావు

చంద్రగిరి: మండల పరిధిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో సోమవారం 2023–24 సంవత్సరానికి గాను ఇంజినీరింగ్ బ్రాంచ్‌లో ఏఈఏపీసెట్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు పొందిన నూతన విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ మోహన్‌బాబు యూనివర్సిటీలో ఉన్న మౌలిక సదుపాయాల విశిష్టత, యూనివర్సిటీ సాధించిన వివిధ జాతీయ ర్యాంక్‌లు, అక్రిడిటేషన్లను తల్లిదండ్రులకు వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కే.సారథి మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యా బోధన పద్ధతులు, తరగతి గదిలో విద్యార్థుల వ్యవహార శైలి పట్ల పలు కీలక సూచనలు చేశారు. గౌరవ అతిథి రావండ్స్ ప్లాస్టిక్ అధినేత దామోదర్‌నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనిటీ రిలేటెడ్ సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను అలవర్చుకోవలన్నారు. ముఖ్య అతిథి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నాగరాజు రామారావు మాట్లాడారు.

చెక్ బౌన్స్ కేసుల్లో నిందితులకు జైలు

తిరుపతి లీగల్: రెండు వేర్వేరు చెక్ బౌన్స్ కేసుల్లో తిరుపతి భవానీ నగర్‌కు చెందిన నక్కల ఉమాపతికి ఒక్కొక్క కేసులో మూడు నెలల చొప్పున జైలు శిక్ష విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్టు ఫిర్యాది తరఫు న్యాయవాది అప్పిలి ఉమాపతి తెలిపారు. తిరుపతి మధురానగర్‌కు చెందిన జీ.వసంత వద్ద నిందితుడు ఉమాపతి 2020 నవంబర్ 15న రూ.3.33 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అదే ఏడాది డిసెంబర్ 7న అతను ఆమెకు చెక్కును ఇచ్చాడు. దాన్ని ఆమె వారం రోజుల తర్వాత బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యింది. దీంతో ఆమె అతనిపై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే మరో కేసులో తిరుపతి కొర్లగుంట సుభాష్ నగర్‌కు చెందిన పీ.సాయికుమార్ వద్ద నిందితుడు నక్కల ఉమాపతి 2020 సెప్టెంబర్ 20న రూ.2.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో అతను అదే ఏడాది డిసెంబర్ 15న చెక్కును సాయికుమార్‌కు ఇచ్చాడు. ఆ చెక్ బౌన్స్ అయింది. దీనిపై అతను కోర్టులో కేసు దాఖలు చేశాడు. ఈ కేసు ఉమాపతికి మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సర్వే ప్రక్రియ వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

తిరుపతి మంగళం: సర్వే, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే. బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌తో ఓటీఎస్ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్ధిదారులకు శాశ్వత ఇంటి రిజిస్ట్రేషన్ చేయించడానికి వన్ టైం సెటిల్మెంట్ పథకాన్ని తీసుకువచ్చినట్టు గుర్తుచేశారు. జిల్లాలో ఓటీఎస్ సర్వే పూర్తిచేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ముంబయి సంస్థతో మహిళా వర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో మహిళావర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ముంబయి సంస్థ టీమ్ లీజ్ ఎడ్‌టెక్ లిమిటెడ్‌తో పలు అంశాలపై అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అవగాహనా ఒప్పందంపై సోమవారం వీసీ డీ భారతి, రిజిస్ట్రార్ ఎస్.రజని ముంబయి సంస్థ రీజనల్ హెడ్ లోహిత్ డోగ్రా సంతకాలు చేశారు. ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యం అకడమిక్, అడ్మిషన్, ఎక్జామినేషన్ సపోర్ట్ సర్వీసెస్ ఫర్ డిగ్రీ అప్రెంటిషిప్, ఆన్‌లైన్ డిస్టెన్స్ లర్నింగ్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అనే అంశాలపై పరస్పర సహకారం అందిపుచ్చుకోవడం. ఈ సమావేశంలో డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

రూ.9లక్షలు ఎగనామం పెట్టిన చీరాల వ్యాపారి

రొంపిచెర్ల: చీరాలకు చెందిన టమాట వ్యాపారి తమను మోసం చేశాడని మండలానికి చెందిన కొలు రైతులు కొందరు రొంపిచెర్ల పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు..కొలు రైతులు పి.నరసింహారెడ్డి, హరిబాబు, మంజునాథ, కృష్ణయ్య, ఆంజనేయులు, సుదర్శన్, వెంకటరామిరెడ్డి, నారాయణ ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు నెల చివరి వరకు చీరాలకు చెందిన టమాట మండీ వ్యాపారి సత్యంకు టమాట పంటను విక్రయించామని తెలిపారు. సుమారు రూ.9 లక్షల వరకు వ్యాపారి తమకు చెల్లించాల్సి ఉందని, అయితే డబ్బు చెల్లించాలని సత్యంను ఫోన్‌లో అడిగితే మీకు అప్పు లేదని, దిక్కున్న చోట చెప్పుకోండని బెదిరిస్తున్నాడని, విచారణ చేసి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీ, ఫ్రిడ్జ్‌ల సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాలకు చెందిన పరుషులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉపాధి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఉచితంగా పురుషులకు ఏసీ, ఫ్రిడ్జ్‌ల రిపేరు, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెంది 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, కనీసం 10వ తరగతి చదువుకున్న నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను–పోను ఒక్కసారి బస్సు చార్జీ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో నేరుగా సంస్థ వద్దకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక బ్యాచ్‌కు 25 నుంచి 30 మందిని మాత్రమే చేర్చుకుంటామని పేర్కొన్నారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకానగర్, కొత్తపేట, చంద్రగిరి. ఫోన్ నం.79896 80587, 94949 51289లో సంప్రదించాలని కోరారు.

రచయిత జిల్లేళ్ల బాలాజీకి సాహితీ పురస్కారం



జిల్లేళ్ల బాలాజీ

తిరుపతి కల్చరల్: ప్రముఖ రచయిత, అనువాదకుడు జిల్లేళ్ల బాలాజీకి సాహితీ పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, హరివిల్లు చిత్తూరు లలిత కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న సాహితీ మహోత్సవ సభలో ఆయనకు సాహితీ పురస్కారం ప్రదానం చేయనున్నారు. ప్రముఖ కథా రచయిత సీఎస్.చంద్రశేఖర్ ప్రతి ఏటా తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కామాక్షి, నారాయణరావు పేరిట సాహితీ పురస్కారం అందించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 150కిపైగా కథానికలు, 120కిపైగా కవితలు, 130కిపైగా అనువాద కథలు, 12 అనువాద నవలలు రచించడంతో పాటు ఆయన చేస్తున్న సాహిత్య కృషిని గుర్తించి ఈ పురస్కారం ప్రదానం చేశారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం

తిరుపతి సిటీ: విద్యా పరిరక్షణ సమితి ప్రతి ఏడాదీ ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే ప్రతిష్టాత్మకమైన అవార్డు ఈ సారి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగం ప్రొఫెసర్ శారద, ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ జోష్నాను వరించింది. సోమవారం మహిళా విశ్వవిద్యాలయం సావేరి సెమినార్ హాల్లో జరిగిన కార్యక్రమానికి వీసీ భారతి, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు అవార్డు గ్రహీతలను సత్కరించి, అభినందించారు.

వేర్వేరు ప్రదేశాల్లో రైలు కింద పడి ఇద్దరి మృతి

చంద్రగిరి: వేర్వేరు ప్రదేశాల్లో రైలు కింద పడి ఇద్దరు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఉదయ్‌రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని నరసింగాపురం రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 57 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడు ముదురు నీలం రంగు ప్యాంటు, లేత నీలం రంగు షర్టు వేసుకుని ఉన్నాడు. అదేవిధంగా శ్రీనివాసమంగాపురం సమీపంలోని రైల్వే పట్టాలపై సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన మరో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. నలుపు రంగు ప్యాంటు, క్రీం కలరు షర్టు వేసుకుని ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాలను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలిసిన వారు పాకాల రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

దొరవారిసత్రం: కృష్ణాపురం ఎస్టీ కాలనీకి సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన విషయం సోమవారం వెలుగులు వచ్చింది. సూళ్లూరుపేట రైల్వే పోలీసుల కథనం .. కృష్ణాపురం కాలనీ సమీపంలోని డౌన్‌లైన్ పట్టాలపై గుర్తుతెలియన వ్యక్తి మృతి చెందినట్టు సమాచారం వచ్చింది. మృతదేహం బాగా కుళ్లిన స్థితిలో గుర్తుపట్టలేని విధంగా ఉంది. మృతుడు శుక్రవారం రాత్రి చార్మినార్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారీపడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జీఆర్పీ ఎస్ఐ మాలకొండయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని మహిళ మృతి



మృతి చెందిన గుర్తు తెలియని మహిళ

దొరవారిసత్రం: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని గొల్లపాళెం గ్రామ సమీపంలోని డౌన్‌లైన్ పట్టాల వద్ద సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే రైలు నుంచి ప్రమాదవశాత్తు 40–45 సంవత్సరాల వయస్సు గల మహిళ జారిపడి మృతిచెందినట్టు తెలిపారు. మృతురాలు బ్లూ కలర్ పంజాబీ డ్రస్ ధరించినట్టు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం



శిక్షణను ప్రారంభిస్తున్న సెట్విన్ సీఈఓ, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

తిరుపతి కల్చరల్: సెట్విన్, మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని చెన్నారెడ్డి కాలనీలోని కమ్యూనిటీ హాల్లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెట్విన్ సీఈఓ డాక్టర్ వీ.మురళీకృష్ణ మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ మూడు నెలల ఉచిత కుట్టుమిషన్ శిక్షణకు మూడు కుట్టు మిషన్లు అందజేయనున్నట్టు వెల్లడించారు. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు తొలి బ్యాచ్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో బ్యాచ్‌గా రెండు విడతలగా శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, కో–ర్డినేటర్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జిల్లా అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం
- ప్రభుత్వ భవనాల నిర్మాణాల వేగం పెంచాలి
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



హాజరైన అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీపీలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి సమస్యలను జెడ్పీ స్టాండింగ్, సర్వసభ్య సమావేశంలో చర్చిస్తారని తెలిసినా పలువురు జిల్లా అధికారులు గైర్హాజరవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్వైవార్షిక పథకాల ద్వారా అర్హులైన వారికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని వివరించారు. కొన్ని చోట్ల మిట్ట ప్రాంతాల్లో చిరుధాన్యాలు, వేరుశెనగ పంటకు నష్టం కలిగిందని దీనిపై వ్యవసాయశాఖ అధికారులు సమగ్రమైన సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల కల్పన ముమ్మరం చేయాలని సూచించారు. పెద్దపంజాణి మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు జరగడం లేదన్న ఫిర్యాదు వచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో పీఆర్ ఎస్ఈ వెళ్లి పరిశీలించాలని, అక్టోబరు 30వ తేదీ లోపు ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

విజిలెన్స్ కమిటీల ఏర్పాటు

జిల్లా, మండల స్థాయిలో పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఎఫ్‌పీ షాప్‌ల పర్యవేక్షణకు విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ప్రతినెలా 15లోపు రేషన్‌కార్డుదారులకు బియ్యం అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశానవాటికలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 7న ఎంపీపీ, జెడ్పీటీసీలతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పై చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో, ఈనెల 8న కాణిపాకంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం ఉంటుందన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు ఉలవలు, ఎరువుల ఆర్బీకేల్లో రాయితీ ద్వారా పొందవచ్చని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి తెలిపారు. చిన్న సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నమన్నారు. ఏనుగుల బారి నుంచి పంటలు, ప్రజలను రక్షించడానికి తగిన చర్యలు అటవీశాఖాధికారులు తీసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ వసతి గృహాల్లో నీటి సమస్యలను పరిష్కరించాలని వైస్ చైర్మన్ రమ్య అధికారులను కోరారు. ప్రతి నెలా రెండు సార్లు బాలికలు, గర్భవతులకు వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య కిట్‌ను అందజేస్తున్నామని స్త్రీ సంక్షేమ కమిటీ చైర్మన్ భారతి తెలిపారు. సత్యవేడు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నాయని జెడ్పీటీసీ తెలుపగా కొత్త భవనాల నిర్మాణాలకు నివేదిక పంపినట్లు ఆశాఖ పీడీ వివరించారు. సమావేశంలో ముందుగా కాణిపాకం ఆలయ పండితుల చేత ఆశీర్వచనం ఇచ్చి జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి కలెక్టర్, సీఈఓలను బ్రహ్మోత్సవాలకు రావాలని కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు కోరారు. కార్యక్రమంలో అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.